నమస్తే తెలంగాణ
# నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 21 డిసెంబర్ 2023 | NIRMAL



ఉట్నూర్ డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు

## ప్రిన్సిపాల్ తప్పిదం.. విద్యార్థులకు శాపం..

**పరీక్ష ఫీజు డబ్బు లు కళాశాలలో చెల్లించిన స్టూడెంట్స్**

- యూనివర్సిటీకి చెల్లించని కాలేజీ సిబ్బంది
- హాల్ టికెట్లు రాకపోవడంతో పరీక్ష రాయని 16 మంది విద్యార్థులు
- న్యాయం చేయాలని వేడుకోలు..

ఉట్నూర్, డిసెంబర్ 20 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సెమిస్టర్-1 పరీక్షలు జరుగుతున్నాయి. 16 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు రాకపోవడంతో మంగళవారం ప్రిన్సిపాల్ స్వామిని కలిశారు. బుధవారం పరీక్ష సమయానికి అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు పరీక్ష సమయానికి వెళ్లి అడుగగా.. హాల్ టికెట్లు రాలేదని ప్రిన్సిపాల్ సెలవిచ్చారు. దీంతో 16 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తాము 750 పరీక్ష ఫీజు, 910 యూనివర్సిటీ ఫీజు చెల్లించామని, కళాశాల యాజమాన్యం తమ ఫీజును కాకతీయ యూనివర్సిటీలో చెల్లించకపోవడంతో హాల్‌టికెట్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు చెల్లించిన రశీదులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం తప్పిదంతో ఈ యేడాది నష్టపోవాల్సి వస్తున్నది తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌ను నిలదీయగా సప్లిమెంటరీ పరీక్ష రాయించుతామని పేర్కొన్నాడని తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థులు చెప్పారు.


కోతి దేవుడి దర్శనానికి క్యూలైన్‌లో నిలబడ్డ భక్తులు

## 'కోతి దేవుడి' కోలాహలం

లక్ష్మణచాంద, డిసెంబర్ 20 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం గ్రామంలో కోతిదేవుడి జాతర బుధవారం వైభవంగా కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. జాయింట్ వీల్, దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## హోంగార్డు ఉద్యోగం ఉన్నతమైనది..


హోంగార్డును సన్మానిస్తున్న అదనపు ఎస్పీలు, అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 20 : పోలీస్ హోంగార్డు ఉద్యోగం ఉన్నతమైనదని నిర్మల్ అదనపు ఎస్పీ వీరన్న అన్నారు. జిల్లా సాయుధ కార్యాలయంలో హోంగార్డు ఎండీ నసీరొద్దీన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం జరిగింది. అదనపు ఎస్పీ వీరన్న, అదనపు ఏఆర్ ఎస్పీ వెంకటేశ్వర్లు పూలమాలతో నసీరొద్దీన్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు రాంనిరంజన్, రమేశ్, రామకృష్ణ, ఆర్‌ఎస్‌ఐ దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.





# జేఎన్-1 జాగ్రత్త

**ఒమిక్రాన్ సబ్ వేరియంట్‌తో అప్రమత్తమైన అధికారులు**

- కరోనా నేపథ్యంలో ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలకు ఏర్పాట్లు
- మాస్కు తప్పనిసరి.. జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

ఆదిలాబాద్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కరోనా కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు వైరస్ బారిన పడకుండా చర్యలు తీసుకోవడంతోపాటు కరోనా వచ్చిన వారికి అవసరమైన చికిత్స అందించడానికి ఏర్పాట్లు చేశారు. 2020-2021లో కరోనా ప్రభావంతో చాలా మంది మృత్యువాత పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం వ్యాధిని నివారించడంలో పూర్తిగా సఫలమైంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుపడంతోపాటు ప్రతి ప్రభుత్వ దవాఖానలో వైరస్ సోకిన వారికి చికిత్స అందించారు. కిట్ల పంపిణీ, కరోనా వ్యాక్సిన్, బూస్టర్ డోస్‌లు ఇచ్చి వ్యాధి రాకుండా నివారించారు. ఐసోలేషన్ వార్డులు, ఆక్సిజన్ బెడ్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతుండడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నది. వైరస్ తీవ్రత కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.


ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏర్పాటు చేసిన కరోనా వార్డు

### కొత్త వేరియంట్‌తో జాగ్రత్త

దేశంలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 ప్రభావం చూపుతోందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఈ వైరస్ సోకిన వారికి జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. వైరస్ ప్రభావం కారణంగా రోగ నిరోధక శక్తి తగ్గి ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్ అయి, ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. చలికాలం కావడంతో వైరస్ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలున్నాయి. కరోనా నివారణకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో కరోనా చికిత్స అందించడానికి సర్వం సిద్ధం చేశారు. అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం వ్యాధి లక్షణాలు ఉన్న వారికి కరోనా చికిత్సలు అందిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. వ్యాధి తీవ్రత పెరిగితే సేవలు అందించడానికి ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందులను సిద్ధంగా ఉంచినట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

### వైరస్ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..

**- నరేందర్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి, ఆదిలాబాద్.**

రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కరోనా నిబంధనలు పాటించాలి. మాస్కులు తప్పనిసరిగా ధరించడంతోపాటు దూరం పాటించాలి. వ్యాధి లక్షణాలు ఉన్న వారు సర్కారు దవాఖానలకు వచ్చి చికిత్స తీసుకోవాలి. జిల్లాలోని అన్ని వైద్యశాలల్లో కరోనా చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

## పరీక్షా కేంద్రాన్ని కొనసాగించండి..

ఎదులాపురం, డిసెంబర్ 20 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోనే యథావిధిగా డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని కొనసాగించాలని విద్యార్థు లు డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబా ద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించా రు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కార్యదర్శి అక్షయ్ మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా ఇప్పుడు కూడా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బేల నుంచి ఆదిలాబాద్‌కు రావాలంటే చాలా ఇబ్బందికర పరిస్థి తులు ఉన్నాయని వారు తెలిపారు.


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

# చావనైనా చస్తాం..

**ఇథనాల్ పరిశ్రమను మాత్రం కట్టనివ్వం..**

- భవిష్యత్ తరాలకు నష్టం కలుగనివ్వం..
- దిలావర్‌పూర్, గుండంపల్లి వాసుల ఆందోళన
- జాతీయ రహదారి-61పై బైఠాయించి నిరసన
- రాస్తారోకోతో ఐదు కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- పోలీసులు, ఉన్నతాధికారులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమణ


దిలావర్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై ఇథనాల్ పరిశ్రమ నిలిపివేయాలని ధర్నా చేస్తున్న రైతులు, వివిధ పార్టీల నాయకులు

దిలావర్‌పూర్, డిసెంబర్ 20 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ పనులు ఆపకపోతే ఆత్మహత్యలు చేసుకుంటామని, మా భవిష్యత్ తరాలకు మాత్రం నష్టం కలుగనివ్వమని రైతులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు ఆందోళన నిర్వహించారు. బుధవారం ఉదయం దిలావర్‌పూర్ వద్ద గల జాతీయ రహదారి-61పై బైఠాయించారు. పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడంతో ఎన్‌హెచ్‌కు ఇరువైపులా ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలియడంతో నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ ధర్నా ప్రాంతానికి చేరుకొని శాంతింప జేసేందుకు ప్రయత్నించినా వినలేదు. కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. చివరకు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. అక్కడి నుంచి పరిశ్రమ పనులను ముట్టడించారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులను శాంతింప చేసేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నం చేశారు. చివరికి పరిశ్రమ పనులు పర్యవేక్షిస్తున్న వ్యక్తులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతని ఫోన్ అందుబాటులో లేక పోవడంతో రైతులు ఆందోళన తీవ్రం చేశారు. పోలీసులు, స్థానిక తహసీల్దార్ పరిశ్రమ పనులు జరుగుతున్న ప్రదేశానికి వచ్చి రైతులతోమాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పరిశ్రమలో వివిధ పనులు చేస్తున్న కూలీలు పనులు నిలిపివేసి వెళ్లి పోవాలని సూచించారు. పరిశ్రమ పనులు నిలిపివేయాలని, తమపై ఎన్ని కేసులు పెట్టినా అడ్డుకుంటామని ప్రజలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కు చెందిన నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు రెడీగా ఉండాలి..

- ఓటరు జాబితాను తప్పులు లేకుండా గడువులోగా పూర్తి చేయండి..
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 20 : మెంబర్ ఆఫ్ పార్లమెంట్(ఎంపీ) ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల ఓటరు జాబితా తప్పులు లేకుండా గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఎన్నికల సెల్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


ఉట్నూర్ రూరల్ : లింగోజితండాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

## బతుకుదెరువు చూపండి..

**ఆటోలు నడుపుడు బంద్ జేస్తం.. మీరు చూపించిన పనే జేస్తం..**

- బస్సు ఉచిత ప్రయాణంతో గిరాకీ లేక ఫైనాన్స్ కట్టలేకపోతున్నం..
- ఆటో డ్రైవర్లు, ఓనర్స్ ఆవేదన.. మండల కేంద్రాల్లో రాస్తారోకోలు..


ఉట్నూర్ రూరల్/నార్నూర్/ఇంద్రవెల్లి, డిసెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల మాకు గిరాకీ లేక ఆగం అవుతున్నామని.. బతుకుదెరువు చూపించి ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు, ఓనర్స్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో నిరసన తెలిపారు. ఉట్నూర్‌లోని లింగోజితండా ఎక్స్ రోడ్ వద్ద స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. నార్నూర్ మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో బంద్ పాటించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉట్నూర్ మండల శాఖ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆడే ప్రేమ్, నార్నూర్ మండల శాఖ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, ఇంద్రవెల్లిలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


నార్నూర్‌లో మాట్లాడుతున్న ఆటో యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్

# ఆపేయండి..

- ఎస్‌డీఎఫ్ పనులు నిలుపుదల చేయాలని కాంగ్రెస్ సర్కారు ఆదేశాలు
- నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఆగిపోనున్న అభివృద్ధి
- అర్ధాంతరంగా పనులు నిలిపివేయడంపై కాంట్రాక్టర్ల ఆందోళన

నిర్మల్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద చేపట్టిన అభివృద్ధి పనులు నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోనున్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ ప్రతి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, ప్రతి మండల కేంద్రానికి రూ.25 లక్షలు, ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున ఎస్‌డీఎఫ్ కింద నిధులు మంజూరు చేశారు. వీటితో ఇప్పటికే నిర్మల్ బల్దియాలో దాదాపు రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టారు. అలాగే భైంసా మున్సిపాలిటీలో రూ.85 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. దీంతోపాటు ఖానాపూర్ మున్సిపాలిటీలో దాదాపు రూ.12 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. ఇటీవలే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విడుదల నిలిపివేయాలని, మంజూరు చేయవద్దంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మెమో నంబర్ 3293/2023ని జారీ చేసింది. ఈ పథకం కింద చేపట్టిన పనులు, నిధుల వివరాలు అందించాలని పేర్కొన్నది. ఫలితంగా అధికారులతోపాటు కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టాల్సిన ప్రభుత్వమే ఎస్‌డీఎఫ్ పథకాన్ని నిలుపుదల చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


GOVERNMENT OF TELANGANA
PLANNING (VI) DEPARTMENT

ఎస్‌డీఎఫ్ పనులను ఆపాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీ


భైంసా పట్టణంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు(ఫైల్)

### అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు..



ప్రభుత్వం మారినంత మాత్రాన అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో రూ.25 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులకు టెండర్లను ఖరారు చేశాం. ఇప్పటికే దాదాపు రూ.3 కోట్ల పనులు పూర్తయ్యాయి. వాటికి సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది. అర్ధాంతరంగా పథకాన్ని నిలిపివేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల భవిష్యత్‌లో పనులు చేసేందుకు ఏ కాంట్రాక్టర్ ముందుకు రాడు. రాజకీయాలకు అతీతంగా ఎస్‌డీఎఫ్ పనులు జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

*- గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ చైర్మన్, నిర్మల్.*


నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830. NT-314474

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073. NT-314374

CHANGE OF NAME

★ I, ADE BHARGAVI (Old Name), R/o. 1-139/2, BC Colony, Rudrapur, Komarambheem Asifabad-504 299, TS. Changed My Name as MORLE VARSHA (New Name), W/o. Morle Sai. NT-324477

★ I, REBBENA LAXMI (Old Name), R/o. 3-44/1, Mulkalla Mancherial, TS. Changed My Name as REBBANA LAXMI (New Name), W/o. Rebbana Rajalingu. NT-324477

★ I, KOMAL MUNDADA (Old Name), R/o. 13-09, Main Road, Chennur, Mancherial, TS-504 201. Changed My Name as KOMAL NARAYAN MUNDADA (New Name), W/o. Narayan Das Mundada. NT-324477

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677